

అతనికీ, నాకూ గత ఆర్నెల్లుగా పరిచయం.

కేవలం పరిచయమే తప్ప, మా మధ్య స్నేహం లేదు.

ఈ మాట నే నన్నానని తెలిస్తే అతను బాధపడతాడేమో! అయినా అనక తప్పదు.

ఏదో ఒక సందర్భంలో




ఎక్కడో ఓ చోట పరిచయమై-ఆ మర్నాటి నుంచి ఒకరికొకరెదురై నప్పుడల్లా 'హల్లో' అంటే 'హల్లో' అనుకోవడమే స్నేహమైతే-మా మధ్యా స్నేహం వున్నట్టే లెక్క. కాపీ....

నా దృష్టిలో- 'హల్లో' అంటే 'హల్లో' అనడం, 'హౌ ఆర్యూ'

అంటే 'ఫైన్' అనడం, ఆపైన నాలుగునాళ్ళు కబుర్లు చెప్పుకుని- 'అచ్ఛా విష్యూషల్ మీటెంగెయిన్' అంటూ విడిపోవడం - స్నేహం కాదు- కేవలం పరిచయం మాత్రమే!

అఫ్‌కోర్స్. కొన్ని కొన్ని సార్లు అలాంటి పరిచయాలే కాలానుగతంగా దృఢమై-నిజమైన, నిఖార్సైన స్నేహంగా రూపొందడం కద్దు.

అయితే, అలాంటి ప్రతీ పరిచయమూ స్నేహంగా రూపొందే అవకాశంలేదు కాబట్టి - అలాంటి ఆషామాషీ పరిచయాలకు విలువివ్వన్నేను.

స్నేహం అనగానే - నాకు వెంటనే మా అయోధ్య గుర్తొస్తాడు.

'గంగిగోవు పాలు గంటెడైనను చాలు, కడవడైననేమి ఖరము పాలు?' అని వేమనన్నట్టు- అయోధ్యలాంటి స్నేహితుడొక్కడుంటే చాలు - నిర్మానుష్యమైన కారడవిలో చిక్కుకుపోయినా, వెనుక వెయ్యిమంది అండగా వున్నంత నిబ్బరంగా వుండొచ్చు.

స్నేహం గురించి ప్రస్తావిస్తూ తమను విస్మరించినందుకు మా మీనాక్షీ, ఉషలు ఈ కథను చదవడం తటస్థిస్తే నొచ్చుకుంటారేమోనని అనుమానం.

అనుమానం ఏమిటి?—తప్పకుండా నొచ్చుకుంటారు.

అయోధ్యతో పోల్చదగ్గ 'స్నేహశీలత' వీళ్ళిద్దర్లోనూ వుంది.

అయితే నేనిపుడు ప్రత్యేకించి అయోధ్యనే పేర్కొనడంలో ఏదైనా విశేషముందా అంటే— లేదు.

'నీకు నీ పెద్దకొడుకంటే ఇష్టమా? చిన్నకొడుకంటే ఇష్టమా?' అని ఏ తల్లినైనా అడిగితే-ఆమెదగ్గరా ప్రశ్నకు సమాధానం వుండదు.

ఒకవేళామె—'పెద్ద కొడుకు' అని అన్నదే అనుకోండి-అయినా అదేమంత నమ్మదగ్గ విషయం కాదు. అప్పటికి ఆమెకలా తోచిందని మాత్రమే గ్రహించాలి. లేదా, ఎవర్నో ఒకర్ని పేర్కొనాలి కాబట్టి ఆమె నాలుక చివర్నుండి 'పెద్ద కొడుకు' ఊడిపడ్డాడని అనుకోవాలి.

అలాగే, అయోధ్య కూడా నా కలం కొసనుండి ఊడిపడ్డాడు. అంతే తప్ప-అయోధ్యా, మీనాక్షీ, ఉషల్లో ఒకరెక్కువా కాదు— మరొకరు తక్కువా కాదు.

ముగ్గురికీ నా మనసులో సమానమైన స్థానమే వుంది.

అసలు—అణి ముత్యాల్లాంటి

స్నేహితులు ముగ్గురు నాకున్నారని చెప్పడం కోసం వాళ్ళ ప్రూసెత్తాను గాని, నిజానికి ఈ కథకీ వాళ్ళకూ ఎలాంటి సంబంధం లేదు.

కాబట్టి వాళ్ళ వివరాలు ప్రస్తుతానికి అప్రస్తుతం.

ఇక అసలు విషయానికొస్తే-

అతని పేరు అచ్యుతం.

అతను నా రచనా వ్యాసాంగంలోని ఓ వ్యక్తి. అతనితో నా పరిచయం అంతంత మాత్రమే!

మా అర్నెల్ల పరిచయంలో అతను నమ్మదగ్గ వ్యక్తిగా నాకెన్నడూ తోచలేదు. అంచేత-అతని గురించి ఎన్నో ఆరాలు తీశాను.

ప్రతిసారి అతను నన్ను కలిసినప్పుడు ఎన్నో ప్రశ్నలు వేశాను.

నేను అడిగిన ప్రశ్నలన్నింటికీ అతడు మామూలుగానే జవాబులిచ్చినప్పటికీ, అతనంటే నా కెందుకో నమ్మకం కలగలేదు.

పడుపు వృత్తి—దాని పుట్టుపూర్వోత్తరాలు, ఏయే సామాజిక మానసిక కారణాల వల్ల స్త్రీలు పడుపు వృత్తిలోకి దిగుతున్నారు? దుర్భరమైన సుఖ రోగాలకు నిలయాలని తెలిసి కూడా పురుషులెందుకు పడుపు గృహాల కెగబడుతున్నారు? 'పడుపు వృత్తి విషవృక్షా'న్ని కూకటి వేళ్ళతో పెళ్ళగించడం సాధ్యమా-కాదా? సాధ్యమైనట్లయితే అందుకు అనుసరించాల్సిన పంథా లేమిటి?-ఇత్యాదులైన వివరాలన్నిటితో పడుపు వృత్తిని గురించి ఓ సమగ్రమైన వ్యాసాన్ని రూపొందించ తలపెట్టి, అందుగ్గాను 'డేటా కలెక్షన్' కోసం ఓ 'శాంపుల్ సర్వే' లాంటిది జరిపాను-ఓ అర్నెల్ల క్రితం.

ఆ సర్వేలో నే ఇంటర్వ్యూ చేసిన కొందరు విటుల్లో అతను ఒకడు.

ఉషోదయా లాడ్జిలో నాకు తటస్థ పడ్డాడు.

ఏ సందర్భంలోనూ తను చెప్పే వివరాలను బహిర్గతం చెయ్యనని ఎంతగానో నచ్చ చెప్పిన మీదట గాని అతనింటర్వ్యూ కొప్పుకోలేదు.

ఇంటర్వ్యూలో నే నతన్నడిగిన తొలిప్రశ్న-"మీ పేరు?"

చెప్పాడు-అచ్యుతమని.

"ఏం ఉద్యోగం చేస్తున్నారు?"

చెప్పాడు-ఫలానా ఉద్యోగమని.

"పెళ్ళైందా?"

తలూపాడు— అయ్యిందన్నట్లు.

"పిల్లలెంత మంది?"

చెయ్యూపాడు-లేరన్నట్టు.

"మీ భార్యకూ, మీకూ ఏమైనా అభిప్రాయ భేదాలున్నాయా?"

"లేవు." అడ్డంగా తలాడించాడు.

"మీ భార్య అందంగా వుండదా?"

"మామూలు అందం కాదు— నా భార్యది కళ్ళు చెదిరే అందం."

ఆ మాట చెబుతున్నపుడు అతని కళ్ళలో వింతగా గర్వం తొణికిస లాడింది.

"ఆమె వద్ద మీకు సరైన సంసార సుఖం దొరకడం లేదా? మరోలా అనుకోకండి-ఇలా అడిగి నందుకు."

ఒకింత సేపు ఆలోచించి అన్నాడు-"అలాంటి దేం లేదు."

నేను ఒకింత సేపు ఆలోచించే అన్నాను-"ఇంటియాలి విడచి ఇల జారకాంతల వెంట దిరుగువాడు వెఱ్ఱివాడు, పంట చేను విడచి పరిగ లేరినయట్లు-అని వేమనో పద్యం చెప్పాడు. మీరెప్పుడన్నా ఆలకిం చారా? చక్కని భార్య ఇంట్లో వుండగా ఇలాంటి 'డర్టీ బిచెస్' కోసం ఎగబడ్డం దేనికి?"

అతను సమాధానం చెప్పలేదు.

బహుశా హర్టయ్యాడేమోనని అతన్ని పరీక్షించి చూశాను.

అలాంటి లక్షణాలేం కన్పించ లేదు.

"పెరైటీ కోసమా?" అడిగాను.

"కాదు." అడ్డంగా తలాడిం చాడు.

"మరి?"

"... ... ..."

ఎటో చూస్తూ అత నాలోచనలో పడ్డాడు.

అతని సమాధానం కోసం ఓ రెణ్ణిమిషాల పాటు వెయిట్ చేసి, ఆ మీదట నేనే అడిగాను-"చెప్పకూడని కారణాలేమైనా వున్నాయా?"

"... ... ..."

అతను సిగరెట్ వెలిగించి, పొగ పీలుస్తూ నా వేపు అదో విధంగా చూశాడు.

చెప్పడానికి సిద్ధపడుతున్నట్టుగా వుంది అతని వాలకం.

"చెప్పండి!" అన్నాను ముందు కొంగుతూ నాలోని కుతూహలాన్ని కనబడనీకుండా.

చెప్పాడు.

అతనేం చెప్పిందీ అతని మాట ల్లోనే చెబితే అందులో కొంత అశ్లీలత వుంటుంది. కాబట్టి అతను చెప్పిన సమాధానం తాలూకు సారాంశాన్ని మాత్రం క్లుప్తంగా చెబుతాను.

అతనికి-తన వల్ల తన భార్యకు శారీరకంగా పూర్తి సౌఖ్యం లభించడం లేదని అనుమానం. 'ఆ క్షణాలలో' ఆమె మవునంగా వుండిపోతుందే తప్ప, తృప్తిగా

విట్టూర్చేదట. మెరుస్తున్న కళ్ళతో అతని వేపు చూడదట. అంచేత 'ఆ కళ' లో ఇతరత్రా-అంటే ఇలా వేరే మార్గాల ద్వారా-ప్రావీణ్యం సంపాదించి, తద్మూలంగా భార్యను సుఖపెట్టాలని అతని అభిలాషట!

అతను చెప్పింది విన్నాక-ఎందుకోగాని, అతని ఆలోచనలో ఎక్కడో ఏదో లోపం వున్నట్టుగా అనిపించింది నాకు.

అయినా ఆ మాట నేను పైకనలేదు. కాజువల్‌గా అడిగాను-"మీ ప్రయత్నాల రిజల్టెలా వుంది?"

"ఇప్పటి కింకా ఫలితమేం కన్పించలేదు. ఇక ముందు సంగతి చెప్పలేను."

"ఇట్సాల్ రైట్! విష్ యు ఆల్ ది బెస్ట్! థాంక్యూ వెరీ మచ్" అంటూ నేను లేచి నిలబడ్డంతో అప్పటి కా ఇంటర్వ్యూ ముగిసింది.

ఓ వారం తర్వాత-బీచ్‌లో తారసపడ్డా డతను. ముందుగా తనే నన్ను గుర్తించి విష్ చేశాడు. "మీన్యాసం ఎంతవరకు వచ్చింది?" అనడిగాడు.

చెప్పాను. చెప్పి, అతని సంగతడిగాను.

"నో ప్రోగ్రెస్" అంటూ పెదవి విరచాడు.

ఓ పదిరోజుల తర్వాత మళ్ళీ జగదాంబా సెంటర్లో బస్‌స్టాప్ వద్ద కనిపించాడు.

బస్ వచ్చే దాకా ఏవో నాలుగు ముక్కలు మాట్లాడుకున్నాం.

అలాగే ఈ ఆర్నెల్లలో అక్కడో సారి, ఇక్కడోసారి ఎక్కడో ఓ చోట ఎదురౌతూనే ఉన్నాడతను.

ఎదురైనపుడల్లా ఫార్మల్‌గా పలకరించుకుంటూనే వున్నాం.

ఇంతకుమించి అతనికీ, నాకూ మధ్య మరే సంబంధం లేదు. 'ఇంటిమసీ' అంతకన్నా లేదు.

'మరే గుడ్డూ లేనపుడు—ఈ కథెందుకూ?' అనంటే—

అందుకు సమాధానం మొన్న శుక్రవారంనాడు జరిగిన 'ఆ సంఘటన' చెబుతుంది.

ఆ రోజు—

చిత్రాలయలో సెకండ్ షో చూసి హాల్లోంచి బైటపడి, రిక్షా ఎక్కి—'పోనియ్'మన్నాను.

ఎప్పుడైనా సరే—రిక్షా ఎక్కి 'పోనియ్'మని, 'ఎక్కడికి సార్?' అని రిక్షావాడు అడిగిన మీదట ఎక్కడికో చెప్పి, గమ్యం చేరాక వాడడిగినంతా చేతబెట్టడం నా కలవాటు.

'ఎక్కడికి సార్?' అనడగ

లేదు రిక్షావాడు మామూలుగా.

జనప్రవాహంలోంచి రిక్షాని లాక్కెళ్తున్నాడు-నేను వెళ్ళాల్సిన దిక్కుకే.

అంచేత నేనూ చెప్పలేదు— ఫలానా చోటుకని.

రిక్షా సైక్లోరూమ్‌ని దాటుతుండగా-వెనుదిరిగి నా వేపు చూసి అడిగాడు రిక్షావాడు- "సార్! బ్రమ్మాండమైన పిట్టుంది. ఫేమిలీ కేసు. పోనీ మంటారా?"

కొంచెం సేపాలోచించి— "పోనియ్" మన్నాను.

'గుంట' కోసం కాదు-ఆ గుంట వెనుక కథావస్తు వేదైనా వుంటుందేమో చూద్దామన్న ఉద్దేశంతో.

పావు గంట తర్వాత ఓ ఇంటి ముందు రిక్షా ఆపి, లోనికి వెళ్ళి ఏదో మాట్లాడి వచ్చి-"ఓ. కే.సార్! నాకు డబ్బులిచ్చి మీరు లోపలికి వెళ్ళొచ్చు" అన్నాడు రిక్షావాడు.

"ఎంత?" అడిగాను.

"చిత్తం-రిక్షా చార్జి రెండు, ఆ చార్జి ఇరవై. మొత్తం ఇరవై రెండిప్పించండి" అన్నాడు చేయి జాస్తూ.

"అదేమిటీ? ఆ ఎమౌంట్ కూడా నీకే ఇవ్వాలా? తను మళ్ళీ నా దగ్గర వసూలు చెస్తేనో?" అనుమానంగా చూశాను.

"తవఁరి కంత అనుమానంగా వుంటే నాతో రండి-ఆవి దెదుచే ఇద్దురు గాని" అంటూ ఇంట్లోకి నడిచాడు.

సందేహిస్తూనే నే నరుగుమీద నిలబడిపోతే- "ఫర్వాలేదు, రండి సార్!" అంటూ లోపలికి పిలిచాడు.

సంకోచాన్ని విడనాడి లోనికి వెళ్ళాను.

ఆ గదిలో జీరోవాల్ట్ బల్బ వెలుగుతూ వుంది.

ఆ మసక వెలుతుర్లో కూడా ఆమె అందం నన్ను దిగ్భ్రాంతుణ్ణి చేసింది.

గుడ్లప్పగించి నే నామె వేపు చూస్తూ నిలబడిపోయాను.

రిక్షావాడు ఆమె దగ్గరగా వెళ్ళి, మెల్లగా ఏదో చెప్పి, "చెప్పండమ్మా!" అన్నాడు గట్టిగా.

"అతనికి ఇరవై రెండంట ఇవ్వండి నేను మిమ్మల్నింకేం అడగను." నన్ను సమీపిస్తూ అందామె.

మారుమాట్లాడకుండా జేబులోంచి పర్సు బయటకి తీసి, ఇరవై రెండు రూపాయలు లెక్కబెట్టి వాడికిచ్చాను.

అవందుకొని వాడు వెళ్ళిపోయాక-తలుపులు మూసి ఆమె నా దగ్గరికొచ్చింది.

ఆ తర్వాత అక్కడేం జరిగిందో పూస గుచ్చినట్టు చెప్పడం ఈ కథకు అంతగా అవసరం కాదు.

ఆమెతో నేనా గదిలో అర గంటసేపు మాత్రమే గడిపాను. అదైనా కేవలం ఆమెను ప్రశ్నిస్తూ ఆమె చెప్పే జవాబుల నాలకిస్తూ.

కొన్ని ప్రశ్నలడిగి వాటికి జవాబులు రాబట్టుకున్నాక, అడిగాను- "నువ్వెందుకీ వృత్తినెన్నుకున్నావ్? ఇల్లూ అదీ చూస్తే సంసార పక్షంగానే ఉంది-నీ సంగతి చూస్తే మరోలా వుంది! నీ భర్త సంపాదన చాలకనా నువ్విలా....?"

అందుకామె దీర్ఘంగా నిట్టూర్చి అంది-"డబ్బు కోసం కాదు. మీరిచ్చిన డబ్బు నాక్కాదు. ఆ రిక్షా పైడి తల్లే తీసుకొంటాడు. గుట్టుగా మీలాంటివాళ్ళ నిక్కడికి తెస్తున్నందుకు అతనికది బక్షీసు. నా భర్త వల్ల నాకు సుఖం లేదు. అందుకే నేనిలా అడ్డదారితొక్కుతున్నాను."

"ఏం? నీ భర్త మగతనం లేనివాడా?" అడిగాను.

"కాదు - నిఖార్సైన మగాడే. కానీ అతనికి వేశ్యల పిచ్చి. వారంలో ఒకరోజు నాతో గడిపితే, తతిమ్మా ఆర్రోజులూ బజారు ముండల్తో గడుపుతాడు. అందుకే" అందామె. అంటూనే నన్ను పెనవేసుకోబోయింది గట్టిగా.

దఢాలున ఆమెను నెట్టివేసి, లేచి నిలబడ్డాను.

నేనక్కడికెందుకొచ్చానో క్లుప్తంగా చెప్పి, ఆమె కోరికను తిరస్కరిస్తూ చకచకా ఆ గది లోంచి బయటపడ్డాను.

అప్పుడు చూశాను - గుమ్మం ప్రక్కగా వున్న 'నేమ్ ప్లేట్'ని.

వెన్నెల రాత్రులు కావడంచేత, వీధిలోని వెన్నెల వెలుగు వరండాలోకి ప్రసరిస్తూ-ఆ 'నేమ్ ప్లేట్' లోని అక్షరాలు నాకు స్పష్టంగా కన్పించాయి.

అందుకే నేనీ కథ రాశాను.

వ్యభిచరించే విషయంలో స్త్రీకొక న్యాయం, పురుషునికొక న్యాయం ఉందని అతననుకుంటే- ఈ కథవల్ల నే నాశించిన ప్రయోజనం నెరవేరకపోగా, ఈ కథ కొన్ని అపర్థాలకు దారి తీయవచ్చు.

అలా కాకూడదని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

ఆమె సోకాల్డ్ శీలం చెడిపోవడానికి కారకుడు తనే గనుక, అతడామెను క్షమిస్తాడనీ, క్షమించి తన జీవితంలోని అపశృతులను సవరించుకుంటాడనీ నా ఆశ!

నా ఆశ అడియాస కాకుండా వుంటే ఎంత బాగుంటుంది! •